క్లుప్తంగా

పశుపోషకులకు ఉచితంగా దాణా పంపిణీ



ఖండవల్లిలో పశువులకు దాణా పంపిణీ చేస్తున్న ఎంపీటీసీలు, పశు సంవర్ధక శాఖ డీడీ రాధాకృష్ణ

పెరవలి: గోదావరి వరదల వల్ల మేత దొరకని పశువులకు ప్రభుత్వం ఉచితంగా దాణా పంపిణీ చేస్తోందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఖండవల్లి, ముక్కామల గ్రామాల పశుపోషకులకు శుక్రవారం ఖండవల్లి గ్రామంలో పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మండలానికి రూ.4.66 లక్షల విలువైన 25 టన్నుల దాణా వచ్చిందన్నారు. ఈ దాణాను 440 మంది పశుపోషకులకు ఒక్కొక్కరికి రూ.50 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నామని వివరించారు. పశు వైద్యాధికారులు సల్మా, చరణ్‌లు మాట్లాడుతూ ఖండవల్లి గ్రామంలో 320 మంది, ముక్కామల గ్రామంలో 120 మంది పశు పోషకులకు ఈ దాణాను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు రవి, బొకే వెంకటేశ్వర్లు, డాక్టర్ రుషి ప్రసాద్, శేఖర్, భవానీ, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనులు

నిడదవోలు రూరల్: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కొవ్వూరు డీఎల్‌పీవో వై.అమ్మాజీ అన్నారు. ఎర్ర కాలువ ముంపు బారిన పడిన మండలంలోని సింగవరం, తాళ్లపాలెం, రావిమెట్ల గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వరదలతో పాటు వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మూడె గ్రామాల్లోనూ మురుగు కాల్వల్లో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం, రావిమెట్ల పంచాయతీల గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్–2గా ప్రమోషన్లు లభించాయి. కాటకోటేశ్వరం పంచాయతీ కార్యదర్శి బొంతా మనోజ్ ప్రకాష్, రావిమెట్ల పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రసుల్లాబేగ్‌లతో పాటు సమిశ్రగూడెం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సంధ్య ప్రమోషన్ పొందారు. వారిని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, ఈఓపీఆర్డీ రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందించారు.


పాడైన కోడిగుడ్ల సరఫరాపై ఆగ్రహం



కోడిగుడ్లు సరఫరా చేసే ఏజెన్సీ ప్రతినిధితో మాట్లాడుతున్న ఎంఈవో–2 నెహ్రూజీ

తాళ్లపూడి: పాడైన కోడిగుడ్లను ప్రాథమిక పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడంపై అన్నదేవరపేట గ్రామస్తులు, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడిగుడ్ల సరఫరా చేసేందుకు శుక్రవారం అన్నదేవరపేట వచ్చిన ఏజెన్సీ నిర్వాహకులను గుడ్ల నాణ్యతపై వారు నిలదీశారు. ఈ ఘటన నేపథ్యంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, ఎంఈవో–2 సీహెచ్ నెహ్రూజీ కోడిగుడ్లను పరిశీలించారు. వారానికొకసారి సరఫరా చేయాల్సిన గుడ్లను 15 రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు, అధికారులు ఆరోపించారు. ఇకపై వారానికి ఒకసారి నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలని, పాడైపోయిన గుడ్లు వెనక్కి తీసుకోవాలని వారు కాంట్రాక్టర్ ప్రతినిధి సతీష్‌కు స్పష్టం చేశారు.

గుళికలు తిని వివాహిత ఆత్మహత్య



బాకి విజయదుర్గ

నల్లజర్ల: కొత్తగా వివాహమైన ఆ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన బాకి విజయదుర్గకు ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన యువకుడితో ఈఏడాది ఏప్రిల్ 3న వివాహమైంది. ఆషాఢ మాసం కావడంతో ఇటీవల ఆమె పుట్టింటికి వచ్చింది. ఏం జరిగిందో ఏమో ఈనెల 24న ఆమె ఇంట్లో ఉన్న గుళికలు మింగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్సకోసం తొలుత నల్లజర్ల ఆసుపత్రికి, ఆ తరువాత విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం విజయదుర్గ మృతి చెందినట్టు సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంగిట్లోనే మురికి కూపాలు

- పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో మురుగు, ముళ్ల పొదలు
- దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే ముప్పు
- స్థలాల ద్వారా కొవ్వూరు మున్సిపాలిటీకి రూ.అర కోటి ఆదాయం
- నిడదవోలుకు రూ.68 లక్షల రాబడి
- మురుగును తొలగించని స్థానిక సంస్థలు



కొవ్వూరు సత్యవతీ నగర్‌లో జనావాసాల మధ్య గల ఖాళీ స్థలంలో నిలిచిపోయిన మురుగునీరు



కొవ్వూరు 22వ వార్డు పోతురాజుదిబ్బ ప్రాంతంలో జనావాసాల మధ్య ఖాళీ స్థలంలో నిలిచి ఉన్న మురుగు

కొవ్వూరు: అసలే వర్షాకాలం. మరోపక్క వరదలు. రోగాలు విజృంభించే రోజులు. కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో ఎక్కడ చూసినా జనావాసాల మధ్య మురుగుకూపాలు దర్శనమిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణం కోసం కొందరు కొనుగోలు చేసుకున్న స్థలాలను ఖాళీగా విడిచి పెట్టడంతో వాటిలో చేరిన వర్షపు నీటితో దుర్గంధం వ్యాపిస్తోంది. రోజుల తరబడి వర్షపు నీరు ఖాళీస్థలాల్లో నిల్వ ఉండిపోవడంతో దోమల బెడద అధికమైంది. గత వారం రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. మరోవైపు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మురుగు నీరు పొంగి కొన్నిచోట్ల రోడ్లపైకి వస్తోంది. కొన్ని ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు మొలిచాయి. ప్రస్తుత వర్షాలకు గుబురుగా ఎదిగిన ఈ ముళ్లపొదల్లో విష సర్పాలు సైతం చేరి ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మునిసిపాలిటీల పరిధిలో లోగడ ఇంజిన్ల సాయంతో ఖాళీ స్థలాల్లోని మురుగు నీటిని బయటికి తోడించేవారు. ఇప్పుడు వాటిని పట్టించుకోకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పురపాలక సంఘాల్లో అప్రూవల్ పొందిన లేఅవుట్స్‌లోని ఖాళీ స్థలాలకు మార్కెట్ విలువలో 0.020 శాతం చొప్పున పన్ను వసూలు చేస్తున్నారు. అంటే స్థలం మార్కెట్ విలువ రూ.లక్ష ఉంటే రూ.200 చొప్పున మున్సిపాలిటీకి ఖాళీ స్థలాల పన్ను (వేకెంట్ ల్యాండ్ టాక్స్) చెల్లించాలి. కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో అప్రూవల్ పొందిన ఖాళీ స్థలాలు 3,915 ఉన్నాయి. ఇవేగాకుండా నాన్ లేఅవుట్ ఖాళీ స్థలాలు వేలలో ఉన్నాయి. వాటిపై మున్సిపాలిటీలు ఆదాయం పొందడమే తప్ప ప్రజారోగ్యం కోణంలో చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రచార ఆర్భాటంపైనే మొగ్గు

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలల పాటు ప్రభుత్వం డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఈ రెండు నెలలూ వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియా, మలేరియా, డెంగీ వ్యాధుల లక్షణాలపై, ఇతర అంటురోగాలు, ఆరోగ్య సమస్యలపై సర్వే చేయడంతో పాటు ఈ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోను, పట్టణాల్లోను పారిశుధ్యానికి అంత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. తాగునీటి క్లోరినేషన్, డ్రైన్లు, పరిసరాల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు కొవ్వూరు డివిజన్‌లో కొన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు కూడా కొన సాగుతున్నాయి. ఇలాంటి తరుణంలో జనావాసాల మధ్య ఉన్న ఈ మురుగు కూపాలు (ఖాళీస్థలాలు) రోగాలను నిలయాలుగా తయారయ్యాయి.

నోటీసులు ఇస్తున్నాం



ఖాళీ స్థలాల్లోని మురుగు నీటి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నాం. స్థలాల యాజమానులకు నోటీసులు ఇస్తున్నాం. స్పందించపోతే ఆయా ఖాళీ స్థలాల్లోని మురుగునీరు, ముళ్లపొదల తొలగింపు పనులు మున్సిపాలిటీ ద్వారా చేయిస్తాం. ఇందుకు అయిన ఖర్చును స్థలం యజమాని నుంచి వసూలు చేస్తాం.

– కె.దానియేల్ జోసెఫ్, కమిషనర్, కొవ్వూరు మున్సిపాలిటీ

రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా నిర్లక్ష్యమే

వేకెండ్ ల్యాండ్ టాక్స్ ద్వారా మున్సిపాలిటీలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. కొవ్వూరు మున్సిపాలిటీలో 1,585 వీఎల్ టీలు (ఖాళీ స్థలాలు) ఉన్నాయి. వాటి ద్వారా మున్సిపాలిటీకి ఏటా రూ.50 లక్షలకు పైబడి ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం కొవ్వూరు మున్సిపాలిటీకి వేకెండ్ ల్యాండ్ టాక్స్ రూపేణా రూ.80,03,648 వసూలు కావాల్సి ఉంది. నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలో 2,330 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీకి రూ.3.72 కోట్ల మేర బకాయిలు రావాలి. కేవలం ఖాళీ స్థలాలపై ఏటా ఇంత ఆదాయం సమకూరుతున్నప్పటికీ ఆ స్థలాల్లో మురుగునీరు తొలగింపుపై మున్సిపాలిటీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

శాకంబరిగా కొవ్వూరమ్మ



శాకంబరి అలంకరణలో ఉన్న కొవ్వూరమ్మకు భక్తుల పూజలు



ఉండ్రాజవరం గండి పోశమ్మ

కొవ్వూరు: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక ఏటిగట్టుపై కొలువైన కొవ్వూరమ్మ వారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ దుద్దుపూడి రాజా రమేష్, అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో గండిపోశమ్మ..

ఉండ్రాజవరం: ఆషాఢం సందర్భంగా ఉండ్రాజవరంలో కొలువైన గండిపోశమ్మ వారు శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ఆలంకరించారు. అర్చకుడు జోస్యుల శివరామకృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి మహిళలు ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో మండలంలోని పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, సూర్యారావుపాలెం, వేలివెన్ను తదితర గ్రామాల అమ్మవారి ఆలయాలను అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ

ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని పాలంగి గ్రామంలో కొలువైన కనకదుర్గమ్మ వారికి పుట్టింటి వారైన వెలిచేటి వంశీయులు, అత్తింటి వారైన గన్నమని వంశీయులు శుక్రవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వంశీయులతో పాటు భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, సారె, పానకం, ప్రసాదాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

రోటరీ సేవలను విస్తృత పరచాలి



రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ శాఖ నూతన కార్యవర్గ సభ్యులు

క్లబ్ 3020 జిల్లా గవర్నర్ శ్రీరామ్

నిడదవోలు: రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృత పరచాలని రోటరీ – 3020 జిల్లా గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా రాచర్ల చైతన్యబాబు, కార్యదర్శిగా ఆకుల రాజీవ్, కోశాధికారిగా కొయ్యే కృష్ణంరాజులతో పాటు కార్యవర్గ సభ్యులతో క్లబ్ గవర్నర్ శ్రీరామ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నలుగురు మెరిట్ విద్యార్థులకు రూ.30 వేల ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో క్లబ్ చేపట్టబోయే సేవా కార్యక్రమాలకు క్లబ్ సలహాదారుడైన ఇంజే శేఖర్ తన సొంత నిధులు రూ.లక్ష విరాళంగా క్లబ్ నూతన అధ్యక్షుడు రాచర్ల చైతన్యబాబుకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వరరావు, గాలి రాఘవయ్య, పెచ్చెట్టి ఫణిసింహ, ఇంజే ఝాన్సీరాణి, వైస్ ప్రెసిడెంట్ గుబ్బల సత్య ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

నీట్ రద్దు చేస్తూ అసెంబ్లీ తీర్మానం

చేయాలంటూ పీడీఎస్‌యూ ఆందోళన



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

కొవ్వూరు: నీట్ పరీక్షను రద్దు చేస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినట్టుగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మహర్షి డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మహర్షి మాట్లాడుతూ పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంతో శ్రమకోర్చి నీట్ పరీక్ష రాశారన్నారు. కొవ్వూరు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో షిఫ్టు తరగతుల నిర్వహణ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో రెండు కళాశాలలు నడిచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహర్షి కోరారు. పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి బన్నె వినోద్, ఉపాధ్యక్షుడు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దోమతెరల పంపిణీ



రైతులకు దోమతెరలు అందిస్తున్న సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఉషారాణి, కంపెనీ మేనేజర్ శ్రీనివాస్

దేవరపల్లి: పంటలకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఫ్యాక్ట్ కంపెనీ ఎరువులు వాడుతున్న రైతులకు ఉచితంగా దోమ తెరలు అందజేస్తున్నట్టు ఆ కంపెనీ సేల్స్ మేనేజరు కె.శ్రీనివాస్ తెలిపారు. దేవరపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ కంపెనీ ద్వారా శుక్రవారం రైతులకు దోమతెరలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ కేఎస్ఎస్ శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. పంటలకు నానో యూరియా, డీఏపీ వాడాలని ఆయన రైతులకు సూచించారు. ఫ్యాక్ట్ కంపెనీ నాణ్యమైన ఎరువులు తయారు చేసి రైతులకు సరఫరా చేస్తోందన్నారు. సామాజిక కార్యక్రమంలో భాగంగా రైతులకు ఉచితంగా దోమ తెరలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. సొసైటీ సీఈఓ శర్మ మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఎక్కువగా ఫ్యాక్ట్ ఎరువులను మార్కెట్ రేటు కంటే తక్కువకు రైతులకు సరఫరా చేస్తున్నారన్నారు. దేవరపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సంజీవ్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున సీజన్ వ్యాధులు రాకుండా దోమతెరలను వాడాలన్నారు. సమావేశంలో సొసైటీ మాజీ చైర్‌పర్సన్ కవల శ్రీనివాస్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె. ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

రేపు ఏఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల భేటీ

కొవ్వూరు: ఈనెల 28న ప్రకాశం జిల్లా దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.ఉద్యోగ భద్రత కల్పించాలని, 30 ఏళ్లుగా పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన

తాళ్లపూడి: కళాశాల విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజానికి మన మందరం అనే కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వాడడం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం ఆయన వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. గంజాయి, హెరాయిన్, మద్యం, సిగరెట్ వంటి వాటికి అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, ఎంఈవో సీహెచ్ బాలామణి, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తగ్గిన వరద .. తేరుకుంటున్న పంటలు



పెరవలి మండలం మల్లేశ్వరం వద్ద నీటిలో ఉన్న అరటి తోటలు



పెరవలి మండలం లంకమాలపల్లి వద్ద కుళ్లిపోయిన బెండ తోట



తాళ్లపూడి మండలం పెద్దేవంలో వర్షాలకు పాడైన ఆకుకూరలు

పెరవలి: గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో లంకల్లో నీట మునిగిన మెరక పంటలు ఒక్కొక్కటిగా ముంపు నుంచి బయట పడుతున్నాయి. పూర్తిగా మునిగిన పంటలు దెబ్బతిన్నాయి. పాక్షికంగా నీట మునిగిన కొబ్బరి, పామాయిల్, కోకో, జామ, అరటి పంటలు కొంతవరకూ దక్కవచ్చని రైతులు భావిస్తున్నారు. దాదాపు మూడు వేల ఎకరాల్లో మండలంలోని గోదావరి లంకల్లో పంటలు విస్తరించి ఉండగా, వాటిలో దాదాపు 1,800 ఎకరాలు ముంపు బారిన పడ్డాయని అంచనా. కూరగాయలు, ఆకుకూరలు, అరటి, కంద, పసుపు, మొక్కజొన్న, నువ్వులు, మినుము, బొప్పాయి వంటి పంటలు పూర్తిగా పాడైపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నీట మునిగిన లంకలను ఇప్పటికే పరిశీలించిన ఉద్యానశాఖ అధికారులు మండలంలో 300 ఎకరాల్లో పంటలు పాడైపోయాయని అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించారు. వరద పూర్తిగా తగ్గిన తరువాత ఎంతమేర నష్టం వాటిల్లిందో, ఏయే పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయో తెలుస్తుందని చెప్పారు. ఇందుకు మరో వారం సమయం పడుతుంది.

ఆకుకూరల పంటలకు అపార నష్టం

తాళ్లపూడి: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని ఆకుకూరల సాగుదారులకు అపార నష్టం వాటిల్లింది. పెద్దేవం, రావూరుపాడు, బల్లిపాడు గ్రామాల రైతులు ఎక్కువగా ఆకుకూరలు పండిస్తూ జీవనం సాగిస్తుంటారు. పుదీనా, కొత్తిమీర, చుక్కకూర, తోటకూర, పాలకూర వంటి ఆకుకూరలను సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో నిండి పొలాల్లోనే ఆకుకూరలు కుళ్లిపోయాయని రైతులు వాపోతున్నారు. వాటితో పాటు కొన్ని చోట్ల కంద పంట కూడా తెగుళ్లు పట్టి దెబ్బతిందని వారు తెలిపారు. ప్రభుత్వం ఆకుకూరల రైతులను ఆదుకోవాలని పెద్దేవం గ్రామ రైతు రాధాకృష్ణ కోరారు.

నేడు నిడదవోలు మున్సిపల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి.రాంభూపాల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ హాజరవుతారని కమిషనర్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి: విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, చెట్ల కొమ్మల నరికివేత నిమిత్తం పెరవలి ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. దాంతో నల్లాకులవారిపాలెం, పెరవలి గ్రామాల్లో విద్యుతు సరఫరా నిలిపి వేస్తామన్నారు.

మేనేజ్‌మెంట్ గ్రాంట్ విడుదల చేయాలి



తహసీల్దార్ ఆచారికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

దేవరపల్లి: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని యూటీఎఫ్ దేవరపల్లి మండల శాఖ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక తహసీల్దార్ వైవీ ఆచారికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు లింగంకుంట రామారావు మాట్లాడుతూ జీఓ నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని, కిలోమీటర్ కంటే ఎక్కువ దూరంలోని పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, పాఠశాలలకు మేనేజ్‌మెంట్ గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. అలాగే అన్ని పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంతో పాటు తెలుగు మీడియాన్ని కూడా సమాంతరంగా బోధించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శివ నాగ ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి బర్రికల నాగేంద్రప్రసాద్, కోశాధికారి కొమారపు ఉమాకాంత్, ఎం.రవికుమార్, వి.ఉదయ్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు డివిజన్‌లో 8,763 ఎకరాల్లోని వరికి నష్టం

కొవ్వూరు: భారీ వర్షాలకు ముంపుబారిన పంట పొలాలు ఇంకా వరద నుంచి తేరుకోలేదు. కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి మండలంలో 160 ఎకరాల్లోను, పెరవలి మండలంలో 15, ఉండ్రాజవరం మండలంలో రెండు ఎకరాల్లో వరి నారుమళ్లకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నాట్లు వేసిన నలభై రోజులకు పైబడిన 7,613 ఎకరాల్లోని వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. నలభై రోజుల్లోపు ముంపు బారిన పడిన 1,149.5 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా గుర్తించారు.

హైస్కూల్లో కార్గిల్ యుద్ధ విజయోత్సవం

కొవ్వూరు: కార్గిల్ యుద్ధ విజయోత్సవ సభను శుక్రవారం పట్టణంలోని బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం సాధించి ఇరవై ఐదేళ్లు పూర్తయ్యిందన్నారు. యుద్ధంలో భారత్ సైన్యం చూపిన వీరోచిత పోరాటం గురించి వక్తలు వివరించారు. బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, ఆ పార్టీ ఏపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నీరుకొండ సూర్యనారాయణ, బీవీ ముత్యాలరావు, హెచ్ఎం రామానుజన్, నియోజకవర్గ కో–కన్వీనర్ డాక్టర్ కె.అనురాధ, తాడిమళ్ల విజయవాణి, ఆలపాటి రామకృష్ణ, చెరుకూరి సాయిరాజు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాల సేవలు వినియోగించుకోండి

చాగల్లు: ప్రస్తుతం మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.బుజ్జి సూచించారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు శిబిరాలను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. సక్రమంగా శిబిరాలను నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె నిర్వాహకులను ఆదేశించారు. చేపట్టాలన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఈ ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.